వినాయక చవితి శుభాకాంక్షలు



వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజలకు చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, తలపెట్టిన కార్యాలను విజయవంతంగా పూర్తి చేయడానికి అనుగ్రహించే వినాయకుడి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ తొమ్మిది రోజులు ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజించి ఆశీస్సులు పొందాలని కోరారు.

గణపతి పూజకు వేళాయె

ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన మండపాలు

వినాయక చవితిని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వాసులు సిద్ధమయ్యారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు మండపాలను సిద్ధం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహాలు, పూజ, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సారి గణేశ్ విగ్రహాల ధరలను అమాంతం పెంచేశారు. పలు చోట్ల మట్టి వినాయకులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

-వికారాబాద్/మేడ్చల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- విగ్రహాల ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం
- ప్రతిమల విక్రయాలతో సందడిగా మార్కెట్లు
- రకరకాల ఆకారాల్లో ఆకట్టుకుంటున్న గణేశుడు
- పూజారులకు పెరిగిన డిమాండ్
- పలుచోట్ల ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

విద్యుత్ కాంతుల ధగధగలు



జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒక రోజు ముందుగానే విద్యుత్ కాంతులు విరజిమ్మేలా నిర్వాహకులు సిద్ధం చేశారు. మండపాల వద్ద లంబోదరుడికి పూజలు చేసేందుకు పూజారులు తప్పని సరి కావడంతో వారికి భారీగా డిమాండ్ పెరిగింది. ఒక్కో పూజారి గరిష్ఠంగా నాలుగు నుంచి ఐదు వరకు మండపాలు పూజ చేసేందుకు బుక్ చేసుకున్నారు. ఐదు రోజులకు రూ.15వేలనుంచి 20 వేలు, 9-11 రోజులకు 20-25 వేల వరకు తీసుకుంటున్నారు.

లంబో'ధర'

వినాయ విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగాయి. గతేడాది కంటే ఈ సారి 20 శాతం ధరలు పెంచేశారు. విగ్రహాల తయారీకి ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులు, ఇతర ముడిసరుకుల ధరలు భారీగా పెరగటమే ఇందుకు ప్రధాన కారణమని విగ్రహాల తయారీదారులు అంటున్నారు.



వినాయక చవితి పండగతో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. వినాయకుడికి ప్రీతిపాత్రమైన తుమ్మి ఆకులు, చింతకాయలు, మారేడుకాయలు, తామర ఆకులు, వివిధ రకాల పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు రావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి.

సందడిగా మారిన మార్కెట్లు



వివిధ రూపాల్లో..

వినాయక విగ్రహాలు వివిధ రకాల భంగిమలు, అనేక అవతారాల్లో మార్కెట్లో సందడి చేస్తున్నాయి. వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాయి. శివాజీ, శ్రీకృష్ణుడిగా, తిరుపతి వేంకటేశ్వరుడిగా, స్పైడర్ మెన్‌గా, మూషికవాహనుడు, ఇలా రకరకాల రూపాల్లో ఆకర్షణగా నిలిచాయి.

పెరిగిన పూలు, పండ్ల ధరలు..

వినాయక చవితి సందర్భంగా పూలు, పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. కిలో చామంతి రూ. 250, బంతి రూ. 60-70, కిలో గులాబీకి రూ.200, లిల్లీ పూలు రూ.300-350 వరకు అమ్ముడు పోయాయి. చిన్న సైజు పూల దండ 100-150 వరకు విక్రయిస్తున్నారు. పెద్ద సైజు రూ.300-500 వరకు అమ్ముతున్నారు. అరటి పండ్లు డజన్‌కు 120-140 వరకు విక్రయిస్తున్నారు.



మట్టి విగ్రహాలనే పూజించాలి

» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

కీసర రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని కలెక్టర్ మను చౌదరి విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం మట్టి విగ్రహాలను అధికారులు, సిబ్బంది, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి రసాయనాలతో తయారు చేసిన ప్రతిమలతో వాతావరణం, నీరు కలుషితం అవుతుందన్నారు. తద్వారా పర్యావరణ సమతుల్యతకు విఘాతం కలుగుతుందన్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించి, విఘ్నాలు తొలగిపోవాలని కోరుకుంటూ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలతో కలిగే ప్రయోజనాలను, రసాయనాలతో చేసిన విగ్రహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలనా అధికారి రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త లింగయ్య, రాకేశ్, ప్రాజెక్ట్ ఎనలిస్ట్, తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

12వేల మట్టి గణపతుల పంపిణీ

» వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,000 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసినట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గణపతి విగ్రహాలను చెరువుల మట్టితో తయారు చేసి చెరువులోనే నిమజ్జనం చేద్దామని తెలిపే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు జలవనరులను కలుషితం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సిద్ధార్థ, జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?

జిల్లాలో యూరియా కష్టాలు

జిల్లాలో యూరియా కష్టాలు నానాటికి పెరిగిపోతున్నాయి. అదును దాటుతున్నా సరిపడా నత్రజని దొరకడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని పనులున్నా అన్నీ పక్కన పెట్టి ఎరువుల దుకాణాల ఎదుట క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా దొరుకుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. దీంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. దీంతో రైతులు ఆవేదనతో రోడ్లెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. భారీగా డిమాండ్ పెరగడంతో డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌కు 35వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ప్రభుత్వం 26వేల మెట్రిక్ టన్నులు కేటాయించింది. కాగా, ఇప్పటి వరకు కేవలం 16వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు.

- సరిపడా దొరక్క ఆందోళనలో అన్నదాతలు
- ఎక్కువగా ఆగ్రోస్, పీఏసీఎస్‌ల ద్వారానే పంపిణీ
- ఈ సీజన్ డిమాండ్ 35వేల మెట్రిక్ టన్నులు
- జిల్లాకు కేటాయించింది 26వేల మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు సరఫరా కేవలం 16వేల మెట్రిక్ టన్నులే



చౌడాపూర్: యూరియా కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కష్టాలు నానాటికి పెరిగిపోతున్నాయి. ఎరువుల దుకాణాల ఎదుట గంటల తరబడి క్యూలో నిలుచున్నా యూరియా దొరుకుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. గంటల తరబడి క్యూలో నిలుచున్నా దొరుకుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. కేంద్రం యూరియా కేటాయింపుల్లో కోత విధించిన సమయంలో వినియోగం పెరగడం సమస్యగా మారింది. యూరియా సమస్య రైతుల కంటి నిండా నిద్ర లేకుండా చేస్తోంది. వానాకాలంలో ఎరువుల ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల నుంచి తేరుకోగానే రైతులు యూరియా కోసం బారులుతీరారు. రైతుల డిమాండ్ మేరకు బహిరంగ మార్కెట్లో

మిగతా 8వ పేజీలో...

సరిపడా సరఫరా చేయాలి

పంటలకు సకాలంలో యూరియా అందకపోతే ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి వేస్తేనే పంటలు ఏపుగా పెరిగి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. యూరియా నిల్వలను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా, ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు యూరియా విక్రయించకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేషన్ కార్డుల జారీలో అక్రమాలు

ఆర్ఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

తాండూరు,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల జారీలోనూ అక్రమాలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. తాండూరు పట్టణం హుస్సేన్‌నగర్‌కు చెందిన ఈర్షద్‌తో పాటు పలువురు కాలనీవాసులు ప్రజావాణిలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయం ద్వారా జులై నెలలో జరిగిన రేషన్ కార్డుల జారీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) గోపి లబ్ధిదారుల నుంచి రూ.2 నుంచి రూ.3 వేల చొప్పున తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు తగిన సాక్ష్యదారులతో నిరూపిస్తామని పేర్కొంటున్నారు. దీనిపై వెంటనే విచారణ జరపాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అయితే ఒకే కార్యాలయంలో పని చేసే అధికారి కాకుండా సబ్ కలెక్టర్ లేదా ఇతర కార్యాలయ తహసీల్దార్‌లను విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌కు వివరణ కొరగా ప్రజావాణిలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.

పార్టీ వ్యవహారాలు ఆగమాగం

» వినూత్న నిరసన తెలిపిన చేవెళ్ల ఎంపీ కొండా
» రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి బహుమతిగా ఫుట్‌బాల్
» జిల్లాల బీజేపీ అధ్యక్షుల తీరుపై అసంతృప్తి



వికారాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలకు పార్టీ ముఖ్య నేతల నుంచి సహకారం కొరవడడంపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో తనను ఫుట్‌బాల్ లాగా ఆడుకుంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి చంద్రశేఖర్ తివారీకి మంగళవారం ఆయన ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన

మిగతా 7వ పేజీలో...



హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి లలితాదేవి

7

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్

తైక్వాండో పోటీల్లో ధనశ్రీకి బంగారు పతకం

యూత్ ఆసియా గేమ్స్, యూత్ ఒలింపిక్స్‌కు ఎంపిక



బంట్వారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండలం నాగ్వారం తండా గ్రామానికి చెందిన తైక్వాండో క్రీడాకారిణి ధనశ్రీ పవార్ బహ్రెయిన్‌లో జరగనున్న 3వ యూత్ ఆసియా గేమ్స్ 2025లో భారత తరఫున పోటీపడేందుకు ఎంపికైంది. అండర్-17 జూనియర్ బాలికల ఐదు కిలోల విభాగంలో ధనశ్రీ పవార్ ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల జరిగిన అస్మితా ఖేలో ఇండియా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది. ఈ మేరకు యూత్ ఆసియా గేమ్స్ 2025లో ఎంపికైంది. అదేవిధంగా 2026లో జరిగే ప్రతిష్ఠాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత జట్టులో చోటు సంపాదించడం విశేషం. భవిష్యత్ పోటీల సన్నాహకాల్లో భాగంగా ఆమె త్వరలోనే భారత శిక్షణా శిబిరంలోనూ పాల్గొననుంది. ధనశ్రీ విజయాన్ని పురస్కరించుకొని పూణెలో మహారాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులు జిల్లా క్రీడా కార్యాలయం (డీఎస్‌వో) ఆధ్వర్యంలో జరిగిన సత్కార కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారత టైక్వాండో అధ్యక్షుడు నామ్‌దేవ్, సందీప్ ఓంబేస్, గఫర్ పఠాన్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భారతదేశం గర్వపడేలా ప్రదర్శనలు ఇవ్వడానికి కృషి చేస్తానని ధనశ్రీ తెలిపారు. పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు శంకరానాయక్ మనీష సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగరీత్యా వీరి కుటుంబం పూణెలోనే స్థిరపడింది. ధనశ్రీ పవార్ అక్కడే ఇంటర్మీడియట్ చదువుతోంది.

88మంది ఎస్జీటీలకు పదోన్నతి

» 16 మందికి పీఎస్ హెచ్‌ఎం, ఎస్ఏలుగా 52 మంది
» ముగిసిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ)కు స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎంలుగా మంగళవారం పదోన్నతులు కల్పించారు. ఖాళీగా ఉన్న మొత్తం స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్‌ఎం పోస్టుల్లో 70 శాతం పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించారు. జిల్లాలో మొత్తం 88మంది ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. 16 మందికి పీఎస్ హెచ్‌ఎంలుగా, 72 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ డీఈవో రేణుకాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్ అసిస్టెంట్లలో బయోసైన్స్‌లో 13 మందికి, ఇంగ్లిష్‌లో 17, హిందీ 2, మేథమెటిక్స్‌లో 10, ఫిజికల్ సైన్స్‌లో 8, సోషల్ స్టడీస్‌లో 18, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఇద్దరికీ పదోన్నతులు కల్పించారు. కాగా, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల్లో చాలా వరకు తాము పనిచేసిన పాఠశాలల నుంచి ఉదయం రిలీవ్ అయి మధ్యాహ్నం తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరారు. పదోన్నతుల ప్రక్రియ సజావుగా ముగియడం పట్ల ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.



570 టన్నుల యూరియా పంపిణీ

కడ్తాల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలంలో ఈ ఏడాది 570టన్నుల యూరియాను సరఫరా చేశామని వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందరాదని సూచించారు. రైతులకు సరిపడే యూరియా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

వర్షాలకు సూక్ష్మధాతువుల లోపం

- జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం

షాడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంటల్లో సూక్ష్మ ధాతువుల లోపం వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం అన్నారు. షాడూరు మండలం చెన్‌గోముల్ రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని తెలిపారు. అనంతరం కండ్లపల్లి శివారులో మాజీ ఎంపీ టీసీ శ్రీనివాస్ పొలంలో మెగ్నీషియం లోపాన్ని గుర్తించి నివారణ చర్యలు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తులసీరాం, విసీర్ధాధికారి ఇలియాజ్, డీలర్లు నర్సింహారెడ్డి, అనంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, రైతులు మహేష్, వెంకటయ్య, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనం పెంచాలని ఆందోళన

నందిగామ, అగస్టు 26(ఆంధ్రజ్యోతి): నందిగామలోని పిత్తి ల్యామినేషన్ ఇంజినీరింగ్ పరిశ్రమ వద్ద వేతనాలు పెంచాలని మంగళవారం కార్మికులు ఆందోళన చేశారు. ఈ పరిశ్రమలో వెల్డింగ్ పనులు చేసే టెక్నీషియన్లు పనికి తగ్గ వేతనాలు లేవని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం పట్టించుకోవడం లేదని పరిశ్రమ గేటు ముందు ఆందోళన చేపట్టారు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. యాజమాన్యం స్పందిస్తూ.. కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నామని, అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆందోళనకు నాయకులు పర్వతాలు, సాయిబాబ, అశోక్, రమేష్‌లు మద్దతు తెలిపారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఆమనగల్లు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలాల్లో పలువురికి మంజూరైన రూ.6.5కోట్ల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలకులు పదేళ్ల సంపదను దోచుకొని రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో బట్టు కిషన్ రెడ్డి, అప్పం శ్రీను, నూదిని కొడంగల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్, బొజ్జసాయిరెడ్డి, జగన్, అనంత్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించొద్దు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమందజేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట్, శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమిచ్చారు. మీడియాతో మాట్లాడారు. సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పేరిట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించే ప్రతిపాదనకు బీఆర్ఎస్ వ్యతిరేకం అన్నారు. దీంతో ప్రజలకు అసౌకర్యం, స్థానికంగా ఉపాధి, అభివృద్ధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్‌ల మధ్య ప్రభుత్వ భూములున్నందున ఇక్కడ కార్యాలయాలు ఉండడం తప్పనిసరి అని కిషన్‌రెడ్డి తెలిపారు.

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

» బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులు అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ అన్నారు. కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై కొంత మంది దుండగులు దాడిని ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించి నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాది రక్షణ చట్టం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పోలీస్ వెంకట్‌రెడ్డి, కమల్‌రెడ్డి, లవకుమార్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, సంపూర్ణానంద్, శంకరయ్య, మాధవ్‌రెడ్డి, శుక్లా వర్ధన్‌రెడ్డి, మొహ్మద్‌రఫీ, అశోక్ కుమార్, శుభప్రద్ పటేల్, ఆనంద్‌గౌడ్, గోపాల్, రాజశేఖర్, మోహన్‌రాజు, బాలయ్య, యాదగిరి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలి

» జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి అన్నారు. డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో మంగళవారం ఆలంపల్లి పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఎంహెచ్‌వో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్, డెమో శ్రీనివాస్, హెచ్‌ఎం దేవయ్య, దిశ సీపీఎం నరేందర్, సీఎస్‌వో రమేశ్, ఐసీటీసీ కౌన్సిలర్ రత్నాకర్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలి

మహేశ్వరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కృషి, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. మంగళవారం కళాశాలలో కెరియర్ గైడెన్స్, ఐక్యూ ఏసీ ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో విజయచందర్, చందన, శ్రీహరిరెడ్డి, ఇంతియాజుద్దీన్, జుహెదా బేగం, ఉపేంద్ర, గోపాల్, చిన్నోజి, సునీత, రవళిక పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల అనంతరం నిమజ్జనోత్సవానికి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ చెక్‌డ్యాం వద్ద చేపడుతున్న పనులను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్ ఏఈ హరిత మంగళవారం పరిశీలించారు. ఒకే రోజు నిమజ్జనాలు జరిగేలా చూడాలన్నారు. వీరి వెంట సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై రామకృష్ణ ఉన్నారు.

మహిళల భద్రతపై దృష్టి సారించండి

యాచారం: కాలానికనుగుణంగా పనితీరును మెరుగుపర్చుకోవాలని, నేరాల నియంత్రణకు, మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీచేశారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ.రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ వైస్ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు అఫ్జల్‌బేగ్ అన్నారు. నేదునూరు-మద్దులకుంట తండా 7కిలో మీటర్ల రోడ్డు పనులకు ప్రభుత్వం రూ:10కోట్లు మంజూరు చేసింది. మంగళవారం వారు పనులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సాధ పాండు రంగారెడ్డి, వి.బాబు, ఎస్.మాధవరెడ్డి, దర్శన్, శంకర్, వి.రవి, రమేష్, ప్రభు, బి.భాస్కర్, సద్దాం పాల్గొన్నారు.

నిర్భయంగా హక్కులు సాధించుకోవాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకుని సాధికారికంగా నిలబడితేనే హక్కులు సాధించుకుంటారని హైకోర్టు న్యాయవాది కుమారి మాధురిభద్రిరాజు అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అంతర్గత ఫిర్యాదుల కమిటీ, సాధికారత కమిటీల ఆధ్వర్యంలో 'మహిళలకు న్యాయపర సవాళ్లు-పరిష్కారాలు' అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ఎక్కడైనా సమస్యలెదురైనప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక మాట్లాడుతూ.. విద్యార్థినులు భద్రత కోసం తమ కళాశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీల కన్వీనర్లు డా.ఎ.రచన, డా.పి.సురేఖ, వైస్‌ప్రిన్సిపాల్ డా.సురేశ్ పాల్గొన్నారు.

గణపయ్య రూపంలో విద్యార్థులు



కేశంపేట పాటిగడ్డలో గణపతి ఆకారంలో విద్యార్థులు

కొడంగల్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా మహాత్మాజ్యోతిబాఫూలే గురుకుల పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో భక్తిని చాటారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల కేంద్రానికి శివారులో తాండూర్ రోడ్డు మార్గంలో ఉన్న పాఠశాల ఆవరణలో మంగళవారం గణపయ్య ఆకారంలో కూర్చుని లంబోదరుడి రూపాన్ని ఆవిష్కరించారు.

వినాయకుడి ఆకారంగా...

కేశంపేట : వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం పాటిగడ్డ సమీప మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో విద్యార్థులు విన్నూత్న ప్రదర్శన చేశారు. విద్యార్థులు గణపతి ఆకారంలో కూర్చొని ప్రదర్శనిచ్చారు. ఈ ఆకారం చూపరులను ఆకట్టుకుంది.

చాక్‌పీస్‌పై...

దౌల్తాబాద్ : మండలంలోని యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్ తన చిత్రకళలో సిద్ధహస్తుడు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయకుడిపై తన కళాభక్తిని చాటుకున్నాడు. ఈ నేపథ్యంలో చాక్‌పీస్‌పై మూడు వైపులా 15వినాయక రూపాలను అద్భుతంగా తీర్చిదిద్దాడు. చాక్‌పీస్‌పై వినాయక రూపాలను చెక్కిన సున్నపు అశోక్‌ను పలువురు అభినందించారు.



కొడంగల్‌లో గణపతి ఆకారంలో విద్యార్థులు



గ్రామంలో 40ఏళ్లుగా ఒకే గణేశ్ విగ్రహం

యాలాల: అన్నసాగర్ గ్రామంలో ఓసీ, బీసీ, ఎస్సీ కులాలకు చెందిన 650మంది ఓటర్లు ఉన్నారు. ఏ పండుగైనా గ్రామంలో అందరూ కలిసిమెలిసి జరుపుకుంటున్నారు. అదేవిధంగా ఈ గ్రామస్తులందరూ కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాదాపు 40ఏళ్లుగా ఒకే ఒక్క వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా గ్రామంలోని అన్ని కాలనీల ప్రజలు, యువకులు ఒకేఒక్క వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నందుకు నిశ్చయించారు.

యూరియా కోసం ఆందోళన



యాచారం సొసైటీ వద్ద యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

యాచారం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం యాచారంలోని సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం రైతులు ఆందోళన చేశారు. 450 బస్తాలు రావాల్సిఉండగా రాకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వరి, పత్తి పంటలకు యూరియా అవసరం ఉందని రైతులు యూరియా కోసం పాట్లు పడుతున్నారు. సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి సిబ్బందితో ఒక్కో రైతుకు రెండు మూడు బస్తాల ఇచ్చేందుకు స్లిప్‌లు ఇచ్చారు. సాయంత్రం వరకూ యూరియా రాక రైతులు ఇంటిదారి పట్టారు. బుధవారం ఉదయానికల్లా 450బస్తాల యూరియా వస్తుందని ఏడీఏ సుజాత చెప్పారు. కాగా ఏవో రవినాథ్ మాట్లాడుతూ.. నానో యూరియా వాడితే మంచి దిగుబడి వస్తుందన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

ఆమనగల్లు: యూరియా సరఫరా చేయాలని ఆమనగల్లులో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డీటీ వినయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వరికుప్పల శ్రీనివాస్‌రెడ్డి, లాలునాయక్, వెంకటయ్య, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, బిక్యనాయక్, కె.నరసింహ, శివ, దేవ్లా, రైతులు పాల్గొన్నారు.

సరిపడా అందించాలి

చేవెళ్ల: రైతులకు సరిపడా యూరియా అందించాలని రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ రాష్ట్ర నాయకులు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయ ఏవో రాజాశేఖర్‌కు వినతిప్రతం ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ప్రభులింగం, సుధాకర్‌గౌడ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, పాపయ్య, దేవి, లలిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

పార్టీ వ్యవహారాలు ఆగమాగం

(ఐదో పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పార్టీ వ్యవహారాల పట్ల ఆయన అసంతృప్తిగా ఉన్నారు. వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు వ్యవహరిస్తున్న తీరుపై కొంత కాలంగా ఆగ్రహంగా ఉన్నారు. పార్టీలో బాధ్యులకు సీనియర్లకు మధ్య సమన్వయం కొరవడి వర్గాలుగా వేర్వేరు కుంపట్లు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్షులు వ్యవహరిస్తున్న తీరు, నేతల మధ్య కొరవడిన సమన్వయం, పార్టీ కార్యక్రమాలపై ఏకపక్ష వైఖరిని చక్కదిద్దేందుకు తాను ప్రయత్నం చేస్తుంటే.. తనను పార్టీలో ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అధిష్ఠానం జోక్యం చేసుకునేలా..

జిల్లా అధ్యక్షులకు, సీనియర్ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగిపోయేలా చర్చించి సమన్వయంతో అందరూ ఐక్యతతో పార్టీ బలోపేతానికి పనిచేసేలా పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకునేలా చేస్తున్న ప్రయత్నాలకు స్పందన కొరవడడంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురైనట్లు సమాచారం. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పార్టీ వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు చొరవ తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారిని కలిస్తే.. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలవాలని చెబుతున్నారని, ఆయనను కలిస్తే అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారని, ఇలా ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెప్పడం పట్ల విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది.

పరిగి రోడ్డుకు మహర్దశ

» ఎమ్మెల్యే వీర్లపలి శంకర్



షాద్‌నగర్ ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పనుల్లో ధ్వంసమైన షాద్‌నగర్-పరిగి రోడ్డుకు త్వరలోనే మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ.. పరిగి రోడ్డు నుంచి కిషన్‌నగర్ రోడ్డు వరకు ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డుకు విస్తరణ, డివైడర్లు, హైమాస్ట్ లైట్ల పనులు చేస్తామన్నారు. నెలరోజుల్లో పనులు చేపట్టి మూడు నెలలో పూర్తి చేస్తామన్నారు.

దేశ భద్రత, అభివృద్ధిని చూసి బీజేపీలో చేరికలు

కేశంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ దేశ రక్షణ, భద్రత, అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి యువత పార్టీలో చేరుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఎంపీ కార్యాలయంలో మంగళవారం కేశంపేటకు చెందిన తలసాని పవన్‌కుమార్‌రెడ్డితో పాటు 50మంది యువకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి మంగళవారం బీజేపీలో చేరారు. వీరికి ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ సభ్యత్వాన్ని అందించి, కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, నరసింహ, కంచుకోట మహేష్, నరేందర్‌రెడ్డి, పల్లె అంజయ్య, శివాజీ, తిరపతి, సతీశ్, దశరథ, మల్లేశ్‌కుమార్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, విమల్, మధు పాల్గొన్నారు.

టీకాల శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పీపీఆర్ వ్యాధి నివారణ టీకాల శిబిరాలను గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. ఇన్ముల్‌నర్వలో మంగళవారం స్ఫూర్తి ఆధ్వర్యంలో జీవాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో పీపీఆర్ టీకాల కోసం శిబిరాలను ఏర్పాటు చేశామని, గొర్లు, మేకలకు విధిగా టీకాలు వేయాంచాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది క్రిష్ణ, రవి, రైతులు పాల్గొన్నారు

జేపీ దర్గాను దర్శించుకున్న హార్టికల్చర్ డైరెక్టర్

కొత్తూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇన్ముల్‌నర్వలో గల హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాను మంగళవారం రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్‌బాషా దర్శించుకుని ప్రార్థనలు చేశారు. కొత్తపేటలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె మార్గమధ్యంలో దర్గాను దర్శించుకున్నారు. ముజావర్లు ఆమెకు తలపాగా చుట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో దర్గా సిబ్బంది జహంగీర్, హర్షద్, రహమత్, పాషా, బురాన్, సల్మాన్, ముజావర్లు పాల్గొన్నారు.



చాదర్‌ను తీసుకువస్తున్న యాస్మిన్‌బాషా

ఫెడరేషన్‌లో నియంతృత్వ పోకడల్లేవ్

» టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) లో ఎలాంటి నియంతృత్వ పోకడలు లేవని, జర్నలిస్టుల ఐక్యతనే సంఘం బలం, బలగమని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి వద్ద పావని ఫామ్ హౌజ్‌లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, ఎం.సైదులు ఆధ్వర్యంలో ఫెడరేషన్ మూడో మహాసభల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రఘు రాజశేఖర్, జాతీయ కమిటీ సభ్యులు దేవేందర్, రంగారెడ్డి సీనియర్ జర్నలిస్టులు గణేష్, శ్రీనివాసాచారి, చంద్రశేఖర్, సురేష్, ఎండీ ఖాజాపాషా(కేపీ) జిల్లా కమిటీ సభ్యులు లక్కాకుల రమేష్ కుమార్, నరసింహారెడ్డి, ఆంజనేయులు పలువురు నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు, జర్నలిస్టులు హాజరై వారివారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘంలోని జర్నలిస్టుల్లో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఇతర సంఘాల నాయకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయ సన్నాహక కమిటీని ప్రకటించారు. మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా చిలివేరు సురేష్, అధ్యక్షులుగా వి.రఘుపతి, కార్యదర్శిగా శ్రీనివాసచారి, కోశాధికారిగా నోముల శ్రీశైలం, ఉపాధ్యక్షులు శేరిబాయి గణేష్, లక్కాకుల రమేష్ కుమార్, యాదగిరి, ఆంజనేయులు, నరసింహారెడ్డి, సీహెచ్ రాజు, సురేందర్, డి.శంకర్, సహాయ కార్యదర్శిగా సైదులు, జోగు శ్రీనివాస్, ఎస్.చంద్రశేఖర్, మిద్దెల సత్యనారాయణ, నరేష్, జగన్, నరసింహ, రఘునందన్, ఈసీ మెంబర్లుగా వివిధ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఉన్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యూరియా పంపిణీపై అపోహలు వద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష

నందిగామ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీపై వస్తున్న అపోహలు నమ్మొద్దని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష అన్నారు. మంగళవారం నందిగామ, చేగూర్ ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలను సందర్శించారు. యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు. అనంతరం చేగూర్ శివారులో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులుకు పలు సూచనలు చేశారు. ద్రవ రూపంలో నానో యూరియా అందుబాటులోకి వచ్చిందని, దానిని పిచికారీ చేస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. యూరియా బస్తాతో పోలిస్తే ధర కూడా తక్కువ అని తెలిపారు. అనంతరం నందిగామ రైతువేదికలో జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్డు ఏర్పాటుకు ముందడుగు

» పరిహారం చెక్కులు అందించిన అదనపు కలెక్టర్

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీ వరకు రేడియల్ రోడ్డు వేయడానికి ముందడుగు పడింది. ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి కందుకూరు మండలం మీర్కాన్‌పేట రెవెన్యూ వరకు మొదటి దశలో చేపట్టనున్న రోడ్డు కోసం ఆరు నెలలుగా రెవెన్యూ అధికారులు మండలంలోని తిమ్మాపురం, లేమూరు, రాచులూరు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. రోడ్డు కోసం కొందుకూరు రైతులు తమ భూములు ఇవ్వమని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి ముందుకు వచ్చింది. తిమ్మాపురం, రాచులూరు రెవెన్యూలో కొందరు రైతులు తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడంతో మంగళవారం వారికి పరిహారం చెక్కులను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణలో 20 గుంటల భూమి ఇచ్చే రైతుకు 60 గజాల ఇంటి స్థలం, 20 గుంటల కంటే ఎక్కువ, ఎకరానికి 121 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికోసం మండలంలోని లేమూరు, తిమ్మాపురం గ్రామాల్లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో లేఔట్ వేయనున్నట్లు పేర్కొన్నారు. తిమ్మాపురం రెవెన్యూలో ఆరుగురు రైతులు నాలుగెకరాల 34 గుంటల భూమిని రోడ్డు కోసం ఇవ్వడానికి ముందుకు వచ్చారని, వారికి రూ.3 కోట్ల 99 లక్షల 78వేల 801 పరిహారం చెక్కులను అందించినట్లు తెలిపారు. రాచులూరు రెవెన్యూలో 43 మంది రైతులు 34 ఎకరాల 04గుంటల భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చారని, వారికి రూ.32 కోట్ల 80లక్షల 56వేల 294 పరిహారం చెక్కులను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్, సీఐ సీతారాం, అర్జున అవార్డు గ్రహీత వి.రవికాంత్‌రెడ్డి, ఆర్ఐ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాలను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అధికారులు అందుబాటులో ఉండి గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్కాజ్‌గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ అధికారులకు సూచించారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం అన్నిశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యుత్‌లైట్లు, వైద్యశిబిరం, మరుగుదొడ్లు, క్రేన్లు, సీసీ టీవీలు, నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సూచిక బోర్డులు, చెరువుకు ఇరువైపుల రెండు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీసులకు, అధికారులకు గంగపుత్ర సంఘంలో భోజన సౌకర్యం కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, సీఐలు రాజువర్మ, శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ రవీందర్, నిత్యానంద్, డీటీ రాజేందర్, ఇరిగేషన్ ఏఈ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములపై నివేదిక తయారీ!

వివరాల సేకరణలో నిమగ్నమైన అధికారులు

యాచారం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తాటిపర్తిలోని సర్వే నంబర్ 104లోని 250 ఎకరాల భూదాన్ భూముల వివరాలను సేకరించడంలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఫార్మాసిటీ భూసేకరణలో భూదాన్ భూములకు పరిహారంపై పత్రికల్లో వచ్చిన కథనాలతో రెవెన్యూ అధికారులు సమగ్ర నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం. 104 సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉంది, ఎంత మంది సాగు చేశారు, ఎంత మందికి పరిహారం అందించారనే విషయమై నివేదిక సిద్ధం చేస్తున్నారు. నేడో రేపో ఈ నివేదిక సీఎంవో కార్యాలయానికి అందనుంది. కాగా, 1954లో భూదానోద్యమం సందర్భంగా తాటిపర్తి గ్రామానికి చెందిన బొక్క సీతారెడ్డి కుటుంబీకులు భూదాన్ యజ్ఞ బోర్డుకు 104 సర్వే నంబర్‌లోని 250 ఎకరాలను దానం చేశారు. అప్పటినుంచి భూదాన్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉందా, లేదా? అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూదాన్ బోర్డు రికార్డులను, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నివేదిక సిద్ధం చేస్తున్నారు. అక్రమంగా పరిహారం పంపిణీ జరిగిందని తేలితే పరిహారం పొందిన వారి నుంచి నిధులు రికవరీ చేస్తారా, లేదా, వారిపై ఏ మేరకు చర్యలుంటాయనేది తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారించడానికి సీసీఎల్ఏ అధికారులు, లేదా సీఎంవో కార్యాలయ అధికారులు గ్రామానికి చేరుకొని విచారించనున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్న విషయం బయటకు పొక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిపై సీఎం చాలాసీరియస్‌గా ఉండడంతో అధికారులు నివేదిక పక్కాగా తయారు చేయడంపై నిమగ్నమయ్యారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం


వికారాబాద్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ మంజులా రమేష్


కొడంగల్: మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


వికారాబాద్: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న భృంగీ విద్యాసంస్థల కార్యదర్శి ప్రమీల చంద్రశేఖర్


తాండూరు: ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని వికారాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్ అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రామ మందిరం దగ్గర ఏర్పాటు చేసిన గణపతి మట్టి విగ్రహాల పంపిణీకి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాలే లక్ష్మణ్ గుప్తా, యాస్కి సునీల్ పాల్గొన్నారు. భృంగీ కళాశాలలో భృంగీ విద్యాసంస్థల కార్యదర్శి ప్రమీల చంద్రశేఖర్ విద్యార్థులకు, అధ్యాపకులు మంగళవారం మట్టి గణనాథులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శివప్రసాద్, కుమారస్వామి, ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. కాగా, పట్టణంలోని ఇంద్రానగర్‌లో భారీ గణనాథుడిని ఏర్పాటు చేశారు.

కొడంగల్: కొడంగల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

తాండూరు: తాండూరులో బుధవారం వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు పలు మండపాలను నిర్వాహకులు ముందుగానే సిద్ధం చేసుకున్నారు. వినాయకచౌక్‌లో రూ.2లక్షల వ్యయం చేసే మండపాన్ని నిర్వాహకులు సిద్ధంచేశారు. పట్టణంలో సుమారు చిన్న, పెద్ద వినాయకులను కలిపి సుమారు 300ల మేరకు ప్రతిష్ఠించే అవకాశం ఉంది. అందులో 50 వినాయకుల వరకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించనున్నారు. బుధవారం(నేడు) ఉదయం మొదటి వినాయకుడి పూజను నెహ్రూ గంజ్‌లో ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయకునికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పూజలు చేయనున్నారు. భద్రేశ్వర్ చౌక్‌లో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పూజలు చేయనున్నారు. తాండూరులో మంగళవారం ఆర్యవైశ్య యువజన సంఘం వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయకులను పంపిణీ చేశారు. గాంధీచౌక్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ కొట్రిక విజయలక్ష్మి, కొట్రిక నాగలక్ష్మి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

ధారూరు: కుక్కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రీన్‌క్రాఫ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏకో ఫ్రెండ్లీ గణేష్ తయారీ చేశారు. మట్టితో వివిధ ఆకారాలలో గణపతి విగ్రహాలను తయారు చేశారు. గ్రీన్ క్రాఫ్స్ డీఎస్‌వో విశ్వేశ్వర్, జీహెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

దోమ: యంగ్ అండ్ ఏకో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. విద్యార్థులకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలతో కలిగే అనర్థాలను వివరించారు. మట్టి విగ్రహాలతో పర్యావరణ కాలుష్యం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సిములు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎకోక్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు పర్యావరణ హిత వినాయక విగ్రహాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టి.రాంబాబు, ఆర్.శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇసోమ్లా పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: డీఎస్పీ


పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి/బషీరాబాద్/మోమిన్‌పేట్/దోమ: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ఎస్.శ్రీనివాస్ అన్నారు. పరిగిలో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో కరీం, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో తాండూరు రూరల్ సీఐ నగేశ్ హిందూ, ముస్లిం మత పెద్దలతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, అజయ్‌ప్రసాద్, ఎస్.వెంకటేష్, రవీందర్‌సింగ్, రాజ్‌కుమార్ కులకర్ణి, మైనార్టీ నాయకులు రజాక్ తదితరులు పాల్గొన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలో సీఐ వెంకట్ పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎస్ఐ అరవింద్, ఆర్ఐ సరిత, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. అదేవిధంగా దోమ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో తహసీల్దార్ గోవిందమ్మ, ఎస్ఐ వసంత్‌జాదవ్ పీస్ కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యామానాయక్, ప్రజాప్రతినిధులు, వినాయక ఉత్సవకమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జుబ్లీహిల్స్ స్కూల్‌లో వేడుకలు

కీసర: నాగారం పరిధి, రాంపల్లి దాయరలోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ భక్తి గీతాలు ఆలపించి, నృత్యాలను చేశారు. వినాయకుని జననం వెనుక ఆంతర్యాన్ని, శివ పార్వతుల కుమారులిద్దరికి పెట్టిన పరీక్షపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది.


నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కొడంగల్/బొంరాస్‌పేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన కొడంగల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండలంలోని ఎన్కెపల్లికి చెందిన తలారి వినోద్ పల్సర్ బైక్‌పై కొడంగల్ నుంచి పరిగి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొడంగల్ పట్టణ శివారులో పరిగి నుంచి కొడంగల్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును రాంగ్ రూట్‌లో వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనపై యువకుడు వినోద్ బాబాయ్ రాంచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి..

మూడుచింతలపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. తూంకుంట మున్సిపాలిటీ పోతాయిపల్లికి చెందిన హరిబాబు(28)అనే కూలీ మంగళవారం సాయంత్రం తూంకుంట నుంచి పోతాయిపల్లికి స్కూటీపై వెళ్తున్నాడు. ఈక్రమంలో రోడ్డుపై ఉన్న పోతాయిపల్లి చెరువు వద్ద స్కూటీని నిలిపి కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో జారిపడ్డాడు. స్కూటీని గమనించిన స్థానికులు చెరువులో హరిబాబు మృతదేహం తేలియాడుతుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామమా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తామరపూల కోసం వెళ్లి వృద్ధుడు..


బాలయ్య మృతదేహం

పరిగి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తామర పూల కోసం వెళ్లి ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మిట్టకోడూరు గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని ఉదాన్‌రావుపల్లికి చెందిన బాలయ్య(60) తన స్నేహితులతో కలిసి పరిగి మండలం మిట్టకోడూరు గ్రామ చెరువులో తామర పువ్వులు ఉన్నాయని తెలుసుకుని అక్కడకు వెళ్లాడు ఈ క్రమంలో చెరువులో తామర పువ్వుల కోసం నీటిలోకి దిగాడు. కొద్ది సేపటికి కనిపించకపోవడంతో తోటి స్నేహితులు ఆందోళనకు గురై కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు పోలీసులు అక్కడకు చేరుకుని చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎస్ఐ మోహనకృష్ణలు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్, మాల్డ జిల్లా, గాజోల్ గ్రామానికి చెందిన ప్రోసెన్‌జెట్ లోహార్(18) పోచారం మున్సిపాలిటీ, ఇన్ఫోసిస్ సమీపంలోని ఎస్‌బీఎల్ నిర్మాణసంస్థ లేబర్ క్యాంప్‌లో ఉంటూ కూలిగా పనిచేస్తున్నాడు. అతడితో పాటు అనిమెష్ సర్కార్, సుజయ్‌ఘోస్, జీత్ ఘోష్‌లు అదే లేబర్ క్యాంప్‌లో పనిచేస్తున్నారు. రెండు రోజుల కిందట ప్రోసెన్‌జెట్ లోహార్ సెల్‌ఫోన్ బాగుచేయించడానికి అన్నోజిగూడలోని ఓ మొబైల్ దుకాణంలో రిపేర్‌కు ఇచ్చాడు. సోమవారం రాత్రి పని ముగించుకొని సెల్‌ఫోన్ తీసుకురావడానికి అన్నోజిగూడ వెళ్లి ఫోన్‌తీసుకొని రాత్రి 8.30గంటలకు లేబర్ క్యాంప్‌కు వచ్చాడు. కోపంగా ఉన్న లోహార్‌ను అనిమెష్ సర్కార్ ఏమైందని అడుగగా ఫోన్‌రిపేర్ కోసం తన తండ్రి బికాస్ లోహార్ డబ్బులు ఇవ్వలేదని, దీంతో కోపం వచ్చి సెల్‌ఫోన్ పగులగొట్టినట్లు తెలిపాడు. నలుగురు కలిసి భోజనం చేసిన తర్వాత మిగతా ముగ్గురు స్టోర్ రూంకు వెళ్లగా ప్రోసెన్‌జెట్ లోహార్ మాత్రం అక్కడే పడుకున్నాడు. మంగళవారం ఉదయం డోర్ తీయకపోవడంతో కిటికిలో నుంచి చూడగా ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. అనిమెష్ సర్కార్ నిర్మాణసంస్థ ప్రతినిధులకు సమాచారం అందించాడు. లోహార్ మెడ కమిలి, గొంతు భాగంలో గాయాలు ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. లోహార్‌ది హత్యనా? ఆత్మహత్యనా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ కచవానిసింగారంలో మంగళవారం హైడ్రా అధికారులు అక్రమనిర్మాణాలను కూల్చివేశారు. కాచవానిసింగారం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 715లో రెండు ఎకరాల భూమిలో చౌదరిగూడ మాజీ సర్పంచ్ భర్త నక్క నర్సింహా వెంచర్ చేసి 40 ప్లాట్లను నిర్మించాడు. అందులో పవన్‌కల్యాణ్ 178ప్లాట్‌ను, శంకర్ 173ప్లాట్‌ను, దేవరాజ్ 179ప్లాట్‌ను కొనుగోలు చేశారు. కానీ నక్క నర్సింహా వెంచర్ చేసి రోడ్లను కబ్జాచేసి ప్లాట్ల యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో బాధితులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. రికార్డులను పరిశీలించిన హైడ్రా అధికారి శ్రీనివాస్ మంగళవారం రోడ్లను కబ్జా చేసిన ప్రహరీలను కూల్చివేసి ప్లాట్ల బాధితుల సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సిబ్బంది, ప్లాట్ల బాధితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బొంరాస్‌పేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం జరిగింది. మండలంలోని రేగడిమైలారంలో కారు-బైక్ ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన చిట్టెం నర్సిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో బైక్‌పై ఉన్న నర్సిరెడ్డి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని నాంపల్లి మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పురుగుల మందు తాగిన మేకలు మృత్యువాత


మేకల కళేబరాలు

కోట్‌పల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పంటలకు పిచికారీ చేసే పురుగుల మందు తాగి 15మేకలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన కోట్‌పల్లి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శైలజ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్నారం గ్రామానికి చెందిన వెల్పుల్ రాచయ్య అనే రైతు తన పొలంలోని పంటలకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు నీళ్లతొట్టిలో మందు కలిపి ఉంచాడు. తొట్టిపై మూత పెట్టకపోవడంతో అదే సమయంలో గ్రామానికి చెందిన తలారి అంజయ్య మేకలు పురుగుల మందు కలిపిన నీళ్లు తాగాయి. దీంతో 15మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మంగళవారం తలారి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శైలజ తెలిపారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మర్పల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం

రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్ ఆరోపించారు. మర్పల్లి మండల కేంద్రంలో నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ పర్శురాంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్, బీజేపీ ఆరాటం


మహేందర్‌రెడ్డి

మర్పల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఆరాపడుతున్నాయని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతుల పట్ల వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం

దుద్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తూర్పు భీములు, ఇందిరమ్మ ఇళ్ల పలువురు లబ్ధిదారులు అన్నారు. గ్రామంలోని చావిడి వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో ఒక్కొక్కరి నుంచి రూ.5వేలు వసూళ్లకు పాల్పడ్డారని చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్ర యాదవ్ అన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో డెంగీ అనుమానిత కేసులనుసందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సుభాష్‌నగర్, గంగారం, రాజీవ్ గృహకల్ప, ఎంఐజీ కాలనీల్లో ప్రతీరోజు డ్రైడే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

దౌల్తాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రిటైర్డ్ ప్రిన్సిపాల్ హనుమంతు, ఎంఈవో వెంకటస్వామి, రిటైర్డ్ ఎంఈవో బాబుసింగ్, రిటైర్డ్ హెచ్ఎం ప్రభాకర్, హెచ్ఎంలు శ్రీహరిరెడ్డి, సాయి పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?

(ఐదో పేజీ తరువాయి)

అందుబాటులో లేకపోవడంతో రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. పీఏసీఎస్ కార్యాలయాలు, ఆగ్రోస్ కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం బారులుతీరాల్సి వస్తోంది. ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరల కారణంగా రైతులు యూరియా కొనుగోలు చేసేందుకు వెనకాడుతున్నారు.

ఆగ్రోస్, పీఏసీఎస్‌ల ద్వారా సరఫరా

ప్రస్తుతం జిల్లా స్థాయిలో యూరియా సరఫరా 60 శాతం పీఏసీఎస్‌లు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారానే కొనసాగుతోంది. కేవలం 40 శాతం మాత్రమే ప్రైవేట్ డీలర్ల ద్వారా సరఫరా అవుతోంది. గతంలో ఆధార్ కార్డు ఆధారంగా రైతులకు యూరియా పంపిణీ చేస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు రైతుల పట్టా పాస్ పుస్తకాలను పరిశీలించి ఎకరాకు రెండు యూరియా బస్తాలు మాత్రమే పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులందరికీ యూరియా లభించాలన్న ఉద్దేశంతో ఇలాంటి నియంత్రణ చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు.

పెరిగిన భారీ డిమాండ్

గతేడాది వానాకాలం సీజన్‌లో జిల్లాకు 24,440 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయగా, ఈసారి 35 వేల మెట్రిక్ టన్నులు అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం జిల్లాకు 26 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించింది. అందులోనూ ఇప్పటి వరకు జిల్లాకు 16వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు. జిల్లాకు కేటాయించిన యూరియాలో ఇంకా 10 వేల మెట్రిక్ టన్నులు విడుదల చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే, గత ఏడాదితో పోలిస్తే ఆగస్టు వరకు 992 మెట్రిక్ టన్నుల యూరియాను అధికంగా సరఫరా చేశామని అధికారులు చెబుతున్నారు.

నానో యూరియా వైపు మొగ్గు

సాధారణ యూరియా సరఫరాను తగ్గించి నానో యూరియాను అందించే దిశగా కేంద్రం చర్యలు చేపడుతోంది. యూరియాపై కేంద్ర ప్రభుత్వానికి సబ్సిడీల భారం పెరిగిన క్రమంలో యూరియాపై సబ్సిడీని క్రమంగా తగ్గించుకునే చర్యలు ప్రారంభించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే యూరియా కేటాయింపులు తగ్గించి యూరియాకు బదులుగా నానో యూరియా రైతులకు సరఫరా చేయాలని యోచిస్తున్నారు. ఒక బస్తా యూరియాతో పాటు ఒక లీటర్ నానో యూరియా రైతులకు పంపిణీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు ప్రచారమవుతోంది.

యూరియా లభ్యతపై భరోసా ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భరోసా ఇవ్వాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో యూరియా లభ్యత, సరిహద్దులో చెక్ పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 19,764 మెట్రిక్ టన్నుల యూరియాను అందించగా ఈ ఏడాది ఇప్పటి వరకు 19,534 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 1,080 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని తెలిపారు. యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 1000 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, ఏడీఏ సందీప్ కుమార్, ఏడీలు ప్రసన్న లక్ష్మీ, శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం


నాగారం రహదారిలో ఏర్పడిన గుంతలను పూడుస్తున్న నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆరోపించారు. నాగారం మున్సిపల్ పరిధి సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చారు. కాంగ్రెస్ పాలనలో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మండిపడ్డారు. వర్షాల కారణంగా ప్రధాన రోడ్డులో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్ గదుల సీజ్

పరిగి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమతి లేకుండా శ్రీచైతన్యస్కూల్‌లో నడిపిస్తున్న తొమ్మిదవ తరగతి గదులను సీజ్ చేసినట్లు ఎంఈవో గోపాల్ తెలిపారు. ప్రజా సంఘాల ఆందోళన నేపథ్యంలో ఎంఈవో గోపాల్ మంగళవారం పాఠశాలను విజిట్ చేశారు. తొమ్మిదవ తరగతి నిర్వహణకు అనుమతిలేనట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇక నుంచి తొమ్మిదవతరగతిని నిర్వహించకూడదని సూచించారు.

మెరిట్ సర్టిఫికెట్లు అందజేత

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మీడిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ విభాగంలోని దేహధారుఢ్యం, డ్రిల్లు, క్రీడల్లో, యోగా కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థినీలు ఎన్‌సీసీలో చేరి ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రూప, రమాదేవి, రవి, ముస్తాఫా, ఎన్‌సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

మా స్థలాలు కబ్జా చేశారు



నిరసన తెలుపుతున్న కందనెల్లి గ్రామస్తులు

పెద్దేముల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తమ పూర్వీకులు దొడ్ల కోసం కొనుగోలు చేసిన స్థలాన్ని కబ్జా చేశారని నికందనెల్లి గ్రామస్థులు కొందరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కందనెల్లిలో సర్వే నంబర్ 1లో సుమారు 20మందికి పైగా రైతులు దొడ్ల కోసం సాదా బైనామా ద్వారా స్థలాలు కొనుగోలు చేశారు. అయితే అప్పుడు స్థలాన్ని విక్రయించిన వారి వారసులకు అట్టి స్థలాలు పట్టాఅయ్యాయి. దీంతో వారు దొడ్ల స్థలాలను కబ్జా చేస్తున్నారని తమ స్థలాలను ఇప్పించాలని తహసీల్దార్‌కు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. సాదాబైనామా ద్వారా తమ పూర్వీకులు కొనుగోలు చేసిన స్థలాలకు పట్టా కల్పించాలని కోరారు.

సంక్షిప్తంగా..

29న జోనల్ లెవల్ క్రికెట్ సెలెక్షన్స్

ఘట్‌కేసర్: ఈనెల 29న అండర్ 14, అండర్ 17 విభాగాల కోసం ఎస్‌జీఎఫ్ 69వ జోనల్ లెవల్ క్రికెట్ సెలెక్షన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఘట్‌కేసర్ జోనల్ కార్యదర్శి కె.శ్రీరాములు మంగళవారం నాడోక ప్రకటనలో తెలిపారు. వివరాలకు పీడీ శివరాం 9291303090 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి

బొంరాస్‌పేట్: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈవో హరిలాల్ సూచించారు. నాగిరెడ్డి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

కులకచర్ల: రాంనగర్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణనాయక్, ఉపాధ్యక్షుడిగా హీర్యానాయక్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా శంకర్, యూత్ అధ్యక్షుడిగా గోపాల్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనునాయక్, సలహాదారులుగా రాంచంద్రయ్య, రాగ్యనాయక్, సాయికుమార్‌ను ఎన్నుకున్నారు.

రైతులకు సబ్సిడీపై పరికరాలు

కొడంగల్: ఎస్ఎంఏఎం పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై వివిధ రకాల వ్యవసాయ పనిముట్లను అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి తులసి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

దుద్యాల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని మలేరియా, ఫైలేరియా అధికారి పకీరప్ప అన్నారు. చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాలలో మంగళవారం దోమల నివారణకు మందులను పంచాయతీ సిబ్బందితో పిచికారి చేయించారు.

మండల సమస్యలపై వినతి

దౌల్తాబాద్: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

లొంకను దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి

పరిగి: కాళ్ళాపూర్‌లోని లొంక ఆంజనేయస్వామిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి టి.ఉమారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

షీటీంపై అవగాహన

వికారాబాద్: కొత్తగడిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం షీటీంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డయల్ 100,181,1098 ప్రాధాన్యతను వివరించారు. స్కూల్ జీహెచ్ఎం వీరకాంతం, షీటీం సిబ్బంది బుచెందర్‌రెడ్డి, రేష్మా, కళాజాత ఇంచార్జి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ అమలైనా మారని ఉపాధ్యాయుల తీరు

బొంరాస్‌పేట్: ఎఫ్ఆర్ఎస్ అమలైనా బొంరాస్‌పేట్ మండలంలో ఉపాధ్యాయుల తీరు మారడం లేదు. రేగడిమైలారం పాఠశాలకు ఉదయం 9 గంటలకు రావాల్సిన ఉపాధ్యాయులు మంగళవారం 9:30 గంటలకు ఆలస్యంగా వచ్చారు. పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా ఉపాధ్యాయుల తీరు మాత్రం మారడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

వికారాబాద్: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 6, 17, 23 వార్డు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు.

రాజకీయ నాయకులతో తహసీల్దార్ సమావేశం

కొడంగల్: రాజకీయ నాయకులతో తహసీల్దార్ విజయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఓటరు జాబితా, నూతన ఓటరు నమోదు తదితర అంశాలపై చర్చించారు.

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు

కొడంగల్: వీరభద్ర స్వామి జయంతి సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అభిషేకం, పూజలు నిర్వహించారు.